

# ఖగాయ మాజరం

**వేమూరి సుబ్రహ్మణ్యం**

సీతాపతి మధ్యాహ్నం కాఫీ పూర్తి చేసుకొని వచ్చి సీటులో కూర్చోగానే ప్యూను వచ్చి "పి. ఎ. గారు పిలుస్తున్నారండీ" అని చెప్పి దగ్గరవుండి వెంటపెట్టుకు రమ్మన్నట్టుగా అక్కడే నిల్చున్నాడు. సీతాపతి తనకీ ఆహ్వానం ఎప్పుడొస్తుందా అని పొద్దుట నుంచి ఎదురు చూస్తున్నాడు. అందుచేత వెంటనే బయలుదేరాడు.

సీతాపతి వెడుతుంటే తక్కిన గుమాస్తాలు అతడివైపు జాలిగా చూశారు. "పాపం! పొద్దునే జాయినయ్యాడు. అప్పుడే పి. ఎ. గారి తాఖీదు! ఈ పి. ఎ. గారికి ప్రతివాళ్ళని పిలిచి వాలుగేసి అక్షింతలు వేయందే తోచదు కాబోలు...."

"అట్లా ఎందుకనుకోవాలండీ? యితను కొత్తగా వచ్చాడుగా. అందుచేత యూ

ఆఫీసులో పద్ధతులు, చేయవలసిన పనులూ అంతా చెబుతోంటేనూ..."

"ఆఁ! నా మొహం. అసలువర్క్ ఆయనకు తెలుస్తేనా, యింకొకళ్ళకు చెప్పటానికి. ప్రతివాళ్ళనీ చెడా మడా నాలుగు తిట్టేస్తే అందరూ తనంటే భయంతో వణికి పోతారని ఆయనకో నమ్మకం. అంతేకాని ఆయనంటే అందరికీ అసహ్యం ఏర్పడిందని తెలియదు. పాపం."

"యిప్పుడితణ్ణి పిలిపించి, కాఫీకెళ్ళి యింతసేపు ఆలస్యం చేశావెందుకనో, మరే కారణం పెట్టో నాలుగు దులిపేస్తాడు. యితడికీ ఆయనంటే భయం ఏర్పడుతుంది అదేగా...."

"ఉష్. మేనేజరొస్తున్నాడు...."

అందరు హడావిడిగా ఫైల్స్‌లో మునిగి పోయి, ప్రభుత్వ యంత్రాంగాన్ని యథావిధిగా నడిపించటానికి యథావిధిగా పాటు పడటం మొదలెట్టారు.

అసలు వాళ్ళనుకున్న దానికి యథార్థం పూర్తిగా విరుద్ధమని వాళ్ళకు తెలియదు పాపం! సీతాపతికి పి. ఎ. గారికి దూరపు చుట్టరికముంది. సీతాపతిని యిక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయగానే అతడి నాన్నగారు పి. ఎ. గారికి వుత్తరం రాశారు. కొడుకుని కొంచెం కనిపెట్టివుండమని. సీతాపతి పొద్దున వచ్చి యిక్కడ డ్యూటీలో చేరినప్పుడు, పి. ఎ. గారు లేరు. సీతాపతి కాఫీకెళ్ళగానే ఆయన కారులో దిగారు. సీతాపతి రాగానే పిలిపించారు.

సీతాపతి స్ప్రింగ్ డోర్ నెట్టుకుని లోపలికి అడుగుపెట్టగానే ఏవో కాగితాలు చూస్తున్న పి. ఎ గారు తలెత్తి "రా. ఇటు కూర్చో" అన్నాడు. ఇదివరకు బాంధవ్య రీత్యా ఎన్ని సార్లు ఆయన్ని చూసినా, ఇప్పుడీ అధికార హోదాతో చూడగానే సీతాపతి తనకు తెలియకుండానే చేతులు జోడించి "నమస్కారమండీ" అన్నాడు.

"కూర్చో."

పి. ఎ. గారి గదిలో సీతాపతికి జరిగిన మర్యాద చూస్తుంటే ప్యూనుకు మతి పోయి నట్టుంది....

పి. ఎ గారు తలెత్తిచూశారు. సీతాపతి ఇంకా నిలబడే వున్నాడు. "కూర్చోవయ్యా ఫరవాలేదు". స్వరంలో అధికారం ప్రతిధ్వనించింది.

సీతాపతి కూర్చున్నాడు.

"నాన్నా వాళ్ళూ కులాసాగా వున్నారు కదూ?"

"కులాసాగానే వున్నారండీ."

"ఎక్కడ దిగావు? సరాసరి ఇంటికి రాక పోయావా?"

"ఇల్లు తెలియదు కదండీ. అదీకాక నా స్నేహితుడు స్టేషను కొచ్చి వాళ్ళ రూముకు తీసికెళ్లాడు."

"అట్లాగా...అన్నట్టు నీకు పెళ్ళయింది కదూ? మరి కాపురం పెట్టవూ?"

"ఏదో ఇల్లు చూసి..."

"అవునులే...రాములూ" అని ప్యూనుని పిలిచారాయన. ఆశ్చర్య సాగరంలోంచి ఒక్క వుదుటున బయటపడి "బాబూ" అంటూ లోపలికొచ్చాడు.

"మేనేజరుగారిని పిల్చుకురా."

రాములు వెళ్ళి మేనేజరుగారితో తిరిగొచ్చాడు. పి. ఎ. గారి ఎదురుగా సీతాపతి కూర్చుని వుండటం చూసి పి. ఎ గారికి మతి భ్రమించిందా, లేకపోతే సీతాపతికి మర్యాద తెలియదా, లేకపోతే ఇదేమయినా కనికట్టా అని ఆశ్చర్యపోతూ మేనేజరు "నన్ను పిలిచారట..." అని నసిగాడు.

"అవునండి కూర్చోండి......ఇతడు మా అన్నగారి కొడుకు. కొంచెం శ్రద్ధగా పని నేర్పండి. మంచి గ్రాస్పింగ్ పవర్ వుంది లెండి. ఒకసారి చెబితే గ్రహించుకుంటాడు."

"అట్లాగే నండీ."

"ఇతనికి 'డి' సీటు ఇచ్చారు కదూ? అందులోంచి పేబిల్స్ తీసేసి 'ఎఫ్' సీటు కిచ్చేయండి."

"అట్లాగే నండి" అని మేనేజరు లేచాడు. సీతాపతికూడా వెళ్ళటానికి లేచాడు.

"సీతాపతీ! సాయంత్రం యింటికిరా. రాములూ సీతాపతిని యింటికి తీసుకురారా...మీ పిన్ని నిన్ను తీసుకురమ్మని స్పెషల్‌గా చెప్పిందోయ్. మర్చిపోకు" అన్నారు పి. ఎ. గారు.

"అట్లాగేనండి" అని చెప్పి మేనేజరు గారితో సహా బయటపడ్డాడు సీతాపతి. మేనేజరు సీతాపతిని తనగదిలోకి తీసుకెళ్ళి "అటు కూర్చో సీతాపతీ" అని కుర్చీ చూపించాడు.

సీతాపతికి యిప్పటికే మనస్సులో కొంచెం గర్వం కలిగింది. పి. ఎ. గారు తనకు దూరపు చుట్టమేగాని యింతలా తనను ఆదరిస్తాడని అనుకోలేదు. స్వంత అన్నగారి కొడుకులాగా ఆదరించాడు తనను. యిక యీ ఆఫీసులో తనొక యువరాజు...అందుచేతనే మేనేజరుగారు కుర్చీలో కూర్చోమనగానే నిస్సంకోచంగా కూర్చున్నాడు.

"పి. ఎ. గారు మీ బంధువులా? ఆసంగతి పొద్దున చెప్పలేదేం సీతాపతీ?"

సీతాపతి కొద్దిగా నవ్వి వూరుకొన్నాడు.

"మీవూళ్ళూ యిద్దరివీ ఒకేచోట వున్నాయా? ఆయన నీకు చిన్నప్పటినుంచీ తెలుసా?"

"బాగా తెలుసండీ. మా నాన్నగారూ యీయనా స్వంత అన్నదమ్ముల్లాగా వుంటారు" అన్నాడు సీతాపతి. పట్టి అబద్ధం. యిద్దరికీ దూరపు చుట్టరికమే, అదీ ఎప్పుడయినా బజారులో కనబడితే 'ఒహో' అంటే 'ఒహో' అనుకోవటమే. అంతే. సీతాపతి, హుషారులో ఒక చిన్న కోత కోశాడు.

సీతాపతి పి. ఎ. గారి బంధువనీ, అతడికి పి. ఎ. గారి గదిలో జరిగిన మర్యాదా, ప్యూను రాములుద్వారా [illegible] అందరికీ



తెలిసింది. వాళ్ళలో, ఒక చిన్న కలకలం బయలుదేరింది. 'యిక నించి సీతాపతితో స్నేహంచేస్తే లాభమని' కొందరూ, 'యింతకుముందు సీతాపతి ఎదుట పి. ఎ. నుగురించి చెడుగా ఏమీ చెప్పలేదుకదా కొంపతీసి' అని మరికొందరు తర్జన భర్జన పడుతున్నారు.

ఇంతలో సీతాపతి మెల్లిగా, దర్జాగా, హాలులో ప్రవేశించి తన సీటులో కూర్చుని, ఆరోజు తన కిచ్చిన 'కరెంట్స్' తీసి చదవటం మొదలు పెట్టాడు.

గుమాస్తాలలో ఒకరికి బ్రహ్మాండమయిన ఆలోచన ఒకటి తట్టింది. వెంటనే అతడు తన సీటులోంచి లేచి ప్రక్కవాడి సీటుదగ్గరికి చేరాడు. "ఏమోయ్ మన పి. ఎ. గారి 'రెలెటివ్'కు ఒక చిన్న పార్టీ ఏర్పాటుచేస్తే బాగుంటుందికదూ ?" అన్నాడు.

"ఫస్టుగా వుంటుంది. ఆర్గనైజు చెయ్యి".

అతడు హుషారుగా హాలంతా ఎడపెడా తిరిగేసి అందరితో చెప్పి, వప్పించి, ఒక్కొక్కరి దగ్గరా అర్ధరూపాయి వసూలుచేసి, ఎవరిదగ్గరయినా లేకపోతే తనే అప్పుయిచ్చి, డబ్బు పోగుచేసి వెళ్ళి మేనేజరుతో చెప్పాడు.

"నీ అయిడియా బ్రహ్మాండంగావుంది. కానీయ్" అన్నాడు మేనేజరు.

"మరి పి. ఎ. గారినీ పిలుద్దామా సార్."

"బాగుండదోయ్.మనమే చేసుకొందాం."

"అల్లాగేనండి. యిప్పుడే యిద్దరు ప్యూన్లను హోటలుకు పంపిస్తాను."

"అల్లాగే లే" అని నవ్వాడు మానేజరు. యితడింత కష్టపడి యిదంతా ఎందుకు చేస్తున్నాడో మేనేజరు పసిగట్టాడు. యీరకంగానయినా పి.ఎ. గారి దృష్టిలో పడితే రోజుకోసారి అనవాయితీగా లభించే చీవాట్లు కొంచెం తగ్గుతాయేమోనని అతడి తాపత్రయం!...

తనరాక సందర్భంగా తనకు పార్టీ యిస్తున్నారని సీతాపతికి తెలిసింది. అతడికి, తనకు తెలియకుండానే, శరీరమంతా గర్వంతో నిండిపోయింది.

పార్టీ ఏర్పాటు చేసిన వెంకట్రావు వచ్చి చెప్పినపుడు, పెద్దరాజకీయ నాయకుడి పోజు పెట్టి విరక్తి ప్రకటిస్తూ "యివన్నీ ఎందుకండీ ?" అన్నాడు.

వెంకట్రావుకు వళ్ళుమండింది. 'యిదంతా యితడి 'క్వాలిఫికేషన్' అనుకొంటున్నాడు పాపం!' అని లోపల అనుకొని "ఏదో సరదాగా చేసుకొందామండీ. మేనేజరూ వస్తామన్నారు" అన్నాడు.

సాయంత్రం పార్టీజరిగింది. అందరూ సీతాపతి ఆయురారోగ్య అభ్యున్నతులను కోరుతూ, టిఫిన్ తిని కాఫీతాగారు. ఆఖరున మేనేజరుగారు రెండుముక్కలు చెప్పారు. సీతాపతి సీటు చాలా ముఖ్యమయిందనీ, అతడికి పని తెలియకపోతే తనున్నాననీ యింకా సీనియర్ గుమాస్తాలున్నారని,

# బంగారు పంజరం

వారినడిగి తెలుసుకొని సీటులో పని ఎప్పటికప్పుడు పూర్తిచేస్తాడని ఆశిస్తున్నానని ముగించారు.

సీతాపతి గదికి వెళ్ళి, స్నానంచేసి గుడ్డలు మార్చుకొని ఆఫీసులో తెలుసుకొన్న అడ్రసుప్రకారం పి. ఎ. గారింటికి బయలుదేరాడు. అతడిస్నేహితుడు సంగతి తెలుసుకొని "సీతాపతీ నామాట ఒక్కటి వింటావా ? ఆయన నువ్వు దగ్గరబంధువులు కారు. ఆయనేమో ఆఫీసరు. ఆ ఆఫీసులో నువు గుమాస్తావి. అంతగా పూసుకు తిరగటం మంచిది కాదేమో ?" అన్నాడు.

"యిందులో పూసుకు తిరగటానికేముందిగా ?..."

మొదటివాడు— చాలా ఇబ్బందిగా ఉందిరా, బ్రదర్. ఓ పదిరూపాయలు ఉంటే సర్దు. నీకు ఆ జన్మాంతమూ ఋణపడి ఉంటాను.

రెండవవాడు — నిజం చెప్పొద్దూ? నాభయం కూడా అదే.

—అవ్వారు అనసూయ (దుర్గాపూర్)

"అవుననుకో. ఎందుకయినా మంచిది నేను చెప్పింది గుర్తుంచుకో."

"ఫరవాలేదులేరా ! యీయన అటువంటివాడు కాదు. నన్ను ఎంత అభిమానంగా ఆదరించాడనీ ఆయనకు బంధువులంటే మొదటినుంచీ అఘోరకమయిన అభిమానం."

సీతాపతి పి. ఎ. గారింటికి చేరుకొనేసరికి ఏడున్నరయింది.

సీతాపతిని గుమ్మంలో చూడగానే ప్యూను "అయ్యగారు అరగంటనుంచి మీకోసరం ఎదురుచూస్తున్నారు, పదండి" అన్నాడు.

సీతాపతిని చూడగానే పి. ఎ. గారు "ఏడింటికల్లా వస్తావని అరగంట ఆలస్యం చేశావేమోయ్. పంక్చుయాలిటీ మెయిన్‌టెయిన్ చెయ్యటం నేర్చుకోవాలి" అన్నారు.

"నేను ఏడని చెప్పలేదండీ."

"పైగా యిదొకటి! చెప్పకపోతే నేను అబద్ధం ఆడుతున్నానంటావా? పద. పద."

యింట్లోవాళ్ళందరూ సీతాపతిని పలకరించారు. పి.ఎ.గారికి యిద్దరుకొడుకులు, ముగ్గురు కూతుళ్ళు. కొడుకులో పెద్దవాడికి పాతికేళ్ళున్నా, మనిషి అఘోరకమయిన వ్యాధితో నంగిపోయి, సరిగా కళ్ళయినా కనబడక, జుట్టంతా నెరిసిపోయి, పుల్లలాంటి శరీరంతో వుంటాడు. రెండో కొడుకు శంకర్రావు బి. ఎ. చదువుతున్నాడు. యిద్దరు కూతుళ్ళు పెళ్ళిళ్ళయిపోయి అత్తవారింటి కెళ్ళారు. ఆఖరికూతురు స్కూలుఫైనలు చదువుతోంది.

భోజనాల దగ్గర పి. ఎ. గారి భార్య సరస్వతి "ఏమండీ, యితనూ వాళ్లావిడ మన యింటి వెనక గదుల్లో వుంటారు. అవి మనకు ఎక్కువగా వుపయోగించటం లేదుగా? పైగా అందరం కలిసి వున్నట్టుగానూ వుంటుంది. ఏమంటారు" అన్నది.

"అవునోయ్ సీతాపతీ ! ఏమంటావ్ ?"

సీతాపతి ఏమనగలడు? మౌనం వహించాడు.

"అంతేనోయ్. మీ పిన్ని చెప్పిన ప్లాను బాగుంది. నువ్వు యింటికోసరం వూరంతా తిరిగి వెతక నక్కరలేదు. అందరూ కలిసివుండొచ్చు. అద్దె కింద ఏదో యిరవై రూపాయలు యిద్దుగానివిలే."

సీతాపతి 'అల్లాగే' అన్నట్టు తలవూపాడు.

సీతాపతి పి. ఎ. గారింట్లోనే వుండబోతున్నాడనే వార్త ప్యూను ద్వారా ఆఫీసులో పాక్కింది. యింకేముంది? యితడి అంతస్తు మరో మెట్టు పెరిగింది. సీతాపతిని అందరూ పి. ఎ. గారి పి. ఎ. గా భావించటం సాగించారు.

తను అందరికంటే గొప్పవాడయినట్లూ, తనలో ఏదో ప్రత్యేకత వున్నట్టూ భావించుకొని సీతాపతి సంతోషసాగరంలో మునిగి తేలుతున్నాడు. తన మామగారికి, భార్యను వెంటనే పంపమని వుత్తరంలో రాసేశాడు. మూడో నాటికల్లా అతడిభార్య కమల, సామానుతో సహా వచ్చేసింది. సీతాపతి పి. ఎ. గారింటివెనుక భాగంలో కాపురం పెట్టేశాడు.

* * *

పదిన్నరకు యింటి దగ్గిర భోజనంచేసి బయలుదేరి సీతాపతి ఆఫీసుకు చేరుకొనేసరికి పదకొండయింది. వెళ్ళి సీటులో కూర్చోగానే ప్యూనువచ్చి "మేనేజరుగారు పిలుస్తున్నారండీ" అని చెప్పాడు.

"యిప్పుడే వచ్చానో లేదో అప్పుడే పిలుపులు" అని కొంచెం గట్టిగానే విసుక్కుంటూ బయలుదేరాడు.

మేనేజరు సీతాపతిని చూడగానే ఒక టెలిగ్రాం అందించి "ఏమండీ యీ ఫైలు మీద గవర్నమెంటుకు రిపోర్టు రాయలేదూ" అని అడిగాడు.

సీతాపతి టెలిగ్రాం అందుకొని "చూసి చెబుతానండి" అని తనసీటు కొచ్చి ఆ ఫైలు దానికి పట్టికెళ్ళి "పంపించలేదండి. యిదెల్లా రాయాలో తెలియక వూరుకొన్నాను" అన్నాడు.

"అకేవిటండి! తెలియకపోతే నన్నడిగితే చెప్పనా? ఆ ఫైలిట్లా యివ్వండి నేనే రాసేస్తాను" అని మేనేజరు ఫైలు తీసుకొన్నాడు. అదే మరేసమయాన్నైనా అయినా యిట్లా చేసివుంటే అతడికి ఆరోజు అన్నం నీళ్ళు సహించనంతగా చీవాట్లు సంప్రాప్తించి వుండేవి.

పి. ఎ. గారితో తనకు గల బంధుత్వం సన్నిహిత్వం తలచుకొని మురిసిపోతూ, సగర్వంగా వచ్చి సీటులో కూర్చున్నాడు సీతాపతి.

ఆ సాయంత్రం యింటికెళ్ళేసరికి కమల యింకా వంటచేస్తూనే వుంది. రోజూ తాను వచ్చేసరికి వంట పూర్తిచేసుకొని కూర్చునేది. సీతాపతి కారణం అడక్కముందే కమల చెప్పింది: "ఎంత ఆఫీసరుగారి పెళ్ళాం పిల్లలయితే మటుకు కొంచెం మంచి మర్యాద వుండనక్కర్లేదుటండీ?"

"ఏం? ఏమైంది?"

"యివ్వాళ శుక్రవారమా? దీపారాధన చేయందే నేను వంటచేయనా? ఆసంగతి వాళ్ళకు ముందే చెప్పాను. అయినా సాయంత్రమయ్యేసరికి మీ పిన్నిగారూ, పిల్లలూ స్నానాలు మొదలు. ఖర్మ! వున్నది ఒక్కటే బాత్‌రూమయిపోయింది. వాళ్ళ స్నానాలు పూర్తయ్యేసరికి రెండుగంటలకు పైగా పట్టింది."

"ఏదోపోనీలేవే సర్దుకుపోవాలి, యిప్పుడేం మునిగిపోయింది. మెల్లిగా వంట కానీయి."

"అది కాదండి మొన్న నేమయిందనుకొన్నారూ, వీళ్ళింటికెవరో వచ్చారు. యిక ఆవిడగారి గొప్పలు వినితీరాలి. మనం యిబ్బంది పడిపోతామేమోనని తమకు యిరుకైనా యీ రెండుగదులు మనకిచ్చారుట. యిక ఆయనగారేమో మీకు పని చేతకాకపోయినా అన్నీ సర్దుకుపోతున్నారుట. యిక వాళ్ళబ్బాయిని తన బొందిలో ప్రాణం వుండగా గుమాస్తాగిరి చేయనివ్వదుట. గుమాస్తాచేస్తూ మనం పడే యిబ్బందులు చూస్తుంటే ఆవిడగారికి పాపం, ఎంతో జాలిట. యింకా యిట్లా ఏదేదో ప్రతిదీ మనతో పోల్చి గొప్ప చెబుతూ అరగంట వాగింది. కోపం వచ్చి ఎడా పెడా రెండూ పెడదామనుకొన్నాను. కాని మీరు ఆయన ఆఫీసులోనే పనిచేస్తున్నారు. అందుకని వూరుకొన్నాను. విసుగుపుట్టి యింటికొచ్చి తలుపేసుకొన్నాను."

"నే చెప్పానుకదూ? అన్నిటికి చూసీ చూడనట్లువూరుకోవడమే. నేను అట్లా క్లబ్బుకెళ్ళి టేబుల్ టెన్నిసు ఆడి యింకో గంటలో వస్తాను" అని సీతాపతి బయలు దేరాడు. యింతలో పి. ఎ. గారి రెండో కొడుకు శంకర్రావు ఎదురొచ్చి "అన్నయ్యా అట్లా బజారుదాకా పోదాం రా" అన్నాడు.

"క్లబ్బుకు వెళుతున్నాను శంకరం! టేబుల్ టెన్నిస్ ఆడుకోవాలి."

"కాదులే అన్నయ్యా బజారుకెళ్ళి వద్దాం రా, కొంచెంపని వుంది."

"పనుంటే నేనెందుకు! క్లబ్బు కొస్తానని ఒక ఫ్రెండుకు మాటయిచ్చాను."

"అయితే నువ్వు రావన్నమాటేనా?" శంకర్రావు కంఠంలో కొంచెం ఆఫీసరుగారి కొడుకులో వుండే అధికారం ప్రతిధ్వనించింది.

సీతాపతి ఏదో జవాబు చెప్పేటంతలో దేవుడిగదిలోంచి పి. ఎ. గారు కొడుకు మందలించి కొంచెం గట్టిగా "శంకరం. వస్తేవాడివి వెళ్ళరాదూ! అతడిని బలవంతం చేయటం ఎందుకు?" అన్నారు.



సీతాపతి వెంటనే "పద, శంకరం. బజారుకే వెళ్దాం" అని బయలుదేరాడు. యిద్దరూ బజారునుంచి యింటికొచ్చేసరికి ఎనిమిదయింది. సీతాపతి యింట్లోకి వస్తూనే "ఇక జన్మలో ఎప్పుడూ వీడితో బజారు కెళ్ళకూడదు. దారిపొడుగునా వాళ్ళ గొప్పా, వాళ్ళ నాన్న గొప్పా చెప్పలేక చచ్చాడనుకో. అబ్బబ్బ వింటుంటే అసహ్యం వేసింది" అన్నాడు.

"మీరు ఒక్కసారికే అట్లా అంటున్నారే! మరి నేనూ రోజూ ఆవిడగారి అరిగిపోయిన గ్రామఫోను ప్లేటు గొడవ వినలేక ఎంతఅవస్థ పడుతున్నానో? ఒకొక్క రోజు తప్పించుకొందామని ఇంట్లోకెళ్ళి పడుకొన్నా పిల్చి మరీ తనసోది మొదలెడుతుంది" అన్నది కమల.

సీతాపతి ఏమీ మాటాడలేదు.

"అసలు బంధువుల ఇళ్ళలో ఉండనేకూడదండీ. అందులో ఆఫీసరుగారింట్లో, అసలు ఉండకూడదు. ఎక్కడున్నా ఇంకోయిల్లు చూడండీ."

"నీకేమన్నా మతిపోయిందా ఏమిటి? ఇప్పుడింకోయిల్లు చూసుకొని వెడితే ఇంకేమయినా వుందా? ఆయన మనస్సులో పెట్టుకుని ఏమయినా చేస్తాడు. ఎలాగో సర్దుకుపోవాలి."

"ఎంతకనండీ? మొన్న ఈ ఇంట్లో వుండటం వల్ల కానాలంటే ప్యూనులచేత పని చేయించుకోవచ్చని మురిసిపోయ్యారా? మొన్న రాముల్ని బజారుకు పంపారా? ఆమధ్యాహ్నం ఎదురింటావిడతో ఈవిడ గొప్పలు చెప్పటం మొదలుపెట్టింది. ప్యూనులు వున్న సుఖం, వాళ్ళింట్లో వుండటంవల్ల నే మనం పొందుతున్నామంట. ఒకటేమిటి. ఆవిడ రోజూ ఇదేరకమయిన వాగుడు వాగుతుంది."

మరునాడు పొద్దున సీతాపతి లేచి మొహం కడుక్కుంటున్నాడు. గంట ఏడున్నర అయివుంటుంది. పి. ఏ. గారు అప్పుడే పూజ అదీ ముగించుకుని సూర్యుడికి నమస్కారం చేయటంకోసం పెరట్లో కొచ్చాడు. వస్తూనే మొహం కడుక్కుంటున్న సీతాపతినిచూసి "ఇప్పుడే లేచావా? సీతాపతీ?" అన్నాడు.

"అవునండీ."

"రోజూ ఇదే వేళకు లేస్తుంటావా? ఏమిటి?"

"అంతేనండి. ఆయనకు మొదటినుంచీ ఇదే అలవాటు" అని లోపలనుంచి కమల జవాబు చెప్పింది.

"మంచి అలవాటే. యీ ఇంట్లో అటువంటివి కుదరవు సీతాపతీ! అందరూ అయిదు గంటలకల్లా లేవాల్సిందే" అని ఆయన సూర్యుడికి నమస్కరించటంలో మునిగిపోయ్యాడు.

ఎదురుగావున్న సీతాపతికి, లోపల కాఫీ

# బంగారు పంజరం

కోస్తున్న కమలకు ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు.

కాఫీతాగి, నిన్న సాయంత్రం లైబ్రరీ నుంచి తెచ్చుకున్న కొత్తనవలను దీక్షగా చదువుతూ కూర్చున్నాడు సీతాపతి. ఇంతలో రాములొచ్చి "అయ్యగారొకసారి పిలుస్తున్నారండీ" అని చెప్పాడు.

ఎందుకో ననుకుంటూ పరధ్యానంగా పుస్తకంతోటే బయలుదేరాడు. గదిలో అడుగుపెట్టటంతోటే పి. ఎ. గారికి సీతాపతి చేతిలోని పుస్తకంపైనే కన్నుబడింది. "ఏమిటోయ్. పరీక్షకు చదువుతున్నావా ఏమిటి" అని చిరునవ్వుతో ప్రశ్నించారు.

"అబ్బే లేదండీ. యిది లైబ్రరీ పుస్తకం—"

"గ్లాసులో చేతులు కడగరాదు అని ఎందుకు వ్రాసిఉంచారండీ" అని ఒక పెద్దమనిషి హోటల్ యజమానినిఅడిగాడు.

"ఈ మధ్య అదే కాఫీ అని త్రాగేశారు కొద్దిమంది. అందుకని........" అన్నాడు ఆ హోటల్ యజమాని.

—మైనూరి నీలకంఠం (మద్రాసు)

"ఓహో! బాగుందా?"

"చాలా యింటెరెస్టుగా వుందండీ."

"నాకు తెలియక అడుగుతాను, యిటువంటివి చదవకపోతే ఏమిటి నష్టం? శుభ్రంగా పోయిన పార్టు కంప్లీటు చేసుకొని డిగ్రీ తెచ్చుకొంటే ఎవరయినా కాదంటారా? అసలు నువ్వు నిద్రలేవటమే తెల్లగా తెల్లవారిన తరువాత. మా శంకరం చూడు. నాతోపాటే పొద్దునే లేస్తాడు. వాడి చదువేదో వాడి లోకమేదోగాని యిట్లా నవలలపిచ్చి, క్లబ్బులపిచ్చి వాడికిలేదు. యీ వయస్సులో చదువు ధ్యాసతప్ప మరేమీ వుండకూడదు. తెలిసిందా? యీ క్లబ్బులూ, యీ టేబుల్ టెన్నీసులూ మనకు అన్నం పెడతాయ్ టోయ్? ఎప్పటికయినా చదువు, డిపార్టుమెంటు టెస్టులూ మనకి యింత అన్నం పెడతాయి. అన్నట్టు బి. ఎ. పార్టు కంప్లీటు చేయటానికి చదువుతున్నావా?"

యీ వుపన్యాసంతో సీతాపతి ఉక్క చచ్చిపోయాడు. మెల్లిగా ఎలాగో "చదువుతున్నానండీ" అన్నాడు.

"ఏం చదువుతున్నావో, నాకేమీ కనిపించటంలేదు, నమ్మకమూ లేదు. పోనీ డిపార్టుమెంటు టెస్టులయినా చదివి ప్యాసుకా. యీ రకంగానయినా పైకిరావచ్చు, తెలిసిందా?"

"అట్లాగేనండి చదువుతాను."

"చదువుతానంటే కాదు. యీ క్లబ్బులూ నవలలూ పూర్తిగా మానెయ్యాలి. ప్యాసయితే తప్ప లాభంలేదు అనే పట్టుదలతో చదవాలి. పట్టుదల వుండాలయ్యా దేనికయినా?... దగ్గిర పెద్దవాళ్ళు లేరు. చెప్పేవాళ్ళు లేక పోవటంమూలాన నీయిష్టం..."

మెత్తమెత్తగా చీవాట్లు తింటూ కూర్చున్నాడు సీతాపతి. తిరిగి ఏమయినా చెబుదామా అంటే ఆఫీసరు. ఎంత బంధువయినా ఆఫీసరుహోదాలో చీవాట్లు పెడుతున్నాడు. ఏదయినా చెప్పబోతే ఆఫీసరుగానే తిడతాడుగూడా. ఆయనకోపం ఆఫీసులో చూస్తూ నేవున్నాడు తను. గుమాస్తాలందరూ మేనేజరుతో సహా ఆయన పిలుస్తున్నాడంటే గుండె లరచేతుల్లో పెట్టుకు పడతారు.

సీతాపతి మౌనంగానే కూర్చున్నాడు.

"ఆ! అన్నట్టు అసలువిషయం చెప్పటం మర్చిపోయాను. రాముల్ని తీసుకొని ఒక్కసారి బజారువెళ్ళి రావాలోయ్. పిన్ని నడుగుతే లిస్టు యిస్తుంది. తీసుకు వెళ్ళు. అసలు శంకరాన్ని పంపేవాడినే గాని వాడికి ఏదో అర్జంటునోట్సు రాసుకోవాలిట. పెద్దవాడు సరేసరి. ఎందుకు పనికిరాడు. వెళ్తావు కదూ? ఒకగంట ఆలస్యంగా ఆఫీసు కొచ్చినా పరవాలేదులే. నేను మేనేజరుకు చెబుతాను. వెళ్ళిరా" అని ఆయన కాగితాల్లో మునిగిపోయ్యాడు. సీతాపతికి ఆయన్ని అమాంతం నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చింది కాని ఏం చేయగలడు?

ఆయన ఆఫీసరు!

తను ఏమీ చేతకాని, చేయలేని చప్పు గుమాస్తా!!

చటుక్కున కుర్చీలోంచి లేచి చకచకా బయటికొచ్చి ఒక్కవిసుగులో యింట్లోకొచ్చి పడ్డాడు. ఆయనింట్లోకి బజారునుంచి సామానులు నేను తేవాలిట. ఛీ! ఛీ! చెప్పటందుకు నోరెట్లా వచ్చిందో! దున్నపోతులాంటి కొడుకున్నాడు పంపించరాదూ? వెధవబుద్ధులూ, వెధవ మనుషులునూ. పైగా ఆవిడేదో ముందే ఏడవరాదూ? నాచదువూ, నా టేబుల్ టెన్నిసూ ఆయనకెందుకూ? బుద్ధి గడ్డితిని యిక్కడ చేరాను.

కమల వచ్చి "ఎందుకండీ ఆయన పిలిచారు?" అని అడిగింది.

"ఇంకెందుకు? నా చదువును గురించి, నా అలవాట్లను గురించి ఓ చిన్న లెక్చరిచ్చాడు. క్లబ్బులకు షికార్లకు వెళ్ళరాదుట. అస్తమానం పుస్తకం పట్టుకూ

చుంకోవాలేగాని పైకి రాగాట. ఖర్మ! మా వాన్నయినా నన్ను ఏమీ అనేవాడుకాడు. యిన్నాళ్ళకి యిక్కడికొచ్చి యీయనచేత మాటలు పడాల్సివచ్చింది. అంతా చెప్పి చివరికి బజారువెళ్ళి వాళ్ళయింట్లోకి కావలసినవి తేవాలిట."

"మీరు తేవాలా? తేనని చెప్పక పోయ్యారా?"

సీతాపతి ఏదో చెప్పేలోపల రాములొచ్చి "పదండి బాబుగారూ. అమ్మగారు లిస్టు రాసిచ్చారు యిదుగో" అని ఒక అరఠావు కాగితం చేతికిచ్చాడు.

సీతాపతి కమలవేపొక చూపు చూసి రాములుతో "పద" అని బయలుదేరాడు. అరఠావు కాగితంలో రాసిన లిస్టు ప్రకారం అన్నీ కొనుక్కొచ్చేసరికి పదిన్నరయింది. పి. ఎ. గారి సతీమణి మాటలు రోడ్డుమీదకే విన్పిస్తున్నయ్. "మావాడికి ఈ గుమాస్తాగిరి చేసే ఖర్మ తప్పిపోవాలని నయ్యి దేవుళ్ళకు మొక్కుకొంటున్నాను, తల్లీ! అందుకే వాడిని ఈ బి. ఎ. పూర్తికాగానే ఎం. ఎ. చదివించెయ్యాలి...ఆయన చెప్పాగులే. మీ ఆయన ఆఫీసులోచేసే పనులకు—కోటికగుటన్నా ఇంకా తెలీదు-ఆ మేనేజరు ఇంకొకళ్ళయితే డిస్మిస్ చేసేవాడు. ఈయన మొహం చూసి ఊరుకొంటున్నాడు..." ఆవిడ సీతాపతి రావటం చూసి ఆగింది. అప్పటిదాకా జైల్లో వుంటున్నట్టు వుంటున్న కమల 'అమ్మయ్య' అనుకొని ఇంట్లోకొచ్చేసింది.

"విన్నారుకదా? రోజూ అదేవరస. వినలేక నా ప్రాణం పోతోంది. ఎరక్కపోయి ఇక్కడ యిల్లు తీసుకొన్నాం..."

"సరే. ఇక ఆపుదూ. అన్నంపెట్టు ఆకలి మండిపోతోంది" విసుక్కున్నాడు సీతాపతి. అతడికి అసలే ఇందాకటినుంచి వళ్ళు మండిపోతోంది. యిట్లా చాకిరి చేయించుకొంటుంటే అయినట్టే. కోపంతోనే లిస్టు ప్రకారం సామానులు కొని, మండిపడుతూ యింటికొచ్చాడు. దాంతో కమల ఏదో చెప్పేసరికి యిందాకటినుంచి లోపల అణగివున్న కోపం వెల్లువకి పైకివచ్చింది...

అన్నం తినగానే సీతాపతికి నిద్రవచ్చింది. రెండు గంటలు నిద్రపోయి లేచి కాఫీతాగి బయలుదేరాడు. తను ఆఫీసుకి ఎప్పుడెళ్ళినా ఫరవాలేదు. పి. ఎ. గారు యీపాటికే 'మావాడు కొంచెం ఆలస్యంగావస్తాడివ్వాళ' అని చెప్పేవుంటారు. 'ఆ కొంచెం ఆలస్యా'నికి ఎంతయినా అర్థంవుంది. ఆ రోజంతా వెళ్ళకుండా సాయంత్రం అయిదు గంటలకు పి. ఎ. గారు కెళ్ళినట్టుగా వెళ్ళి ఒకసారి కనబడినా 'ఆ కొంచెం ఆలస్యం'లో కలిసిపోతుంది.

సీతాపతి ఆఫీసుకెళ్ళి సరాసరి మేనేజరు గదిలోకి వెళ్ళి "గుడ్ మార్నింగ్ సార్" అని



'లేడీస్ ఫస్ట్'

చిత్రకారుడు — అయ్యగారి సుబ్రహ్మణ్యం (విలూరు)

విష్ చేసి అటెండెన్సు రిజిష్టరులో సంతకం చేశాడు.

"అరె, తొందరగా వచ్చావోయ్. పి. ఎ. గారు ఇవ్వాళ మా వాడికి పనుంది కొంచెం ఆలస్యంగా వస్తాడని చెప్పారులే. యింకా ఆలస్యం అవుతుందేమో ననుకున్నా. తొందరగా వచ్చావే. గుడ్" అన్నాడు మేనేజరు.

"ఎందుకండీ! పనయిపోయింది వచ్చాను."

"గుడ్. యిందాక రెండు 'డి. ఒ' లు వచ్చాయ్. వెంటనే నేను వాటికి రిప్లయిలు రాసి పంపేశాను. పర్సనల్ రిజిష్టరులో ఎంట్రీ, వేసుకోండి."

"అట్లాగేనండీ" అని సీతాపతి తనసీటు దగ్గరకు వచ్చేశాడు.

సీతాపతి పర్సనల్ రిజిష్టరులో ఎంట్రీలు వేసుకుంటుంటే పక్కనున్న గుమాస్తా రామ్మూర్తి "అదృష్టవంతుడవోయ్, ఎట్లాగయినా" అన్నాడు.

"ఏమిటో ఆ అదృష్టం?"

"కాకపోతే మరేమిటి? యింకెవరిసీటులోనయినా డి. ఒలు వస్తే యీపాటికి ఆఫీసంతా ఓ యుద్ధకాండ అయిపోయివుండేది. అటువంటిది నీ సీటులో ఒక్కరోజులో రెండు డి. వోలు వచ్చినా మేనేజరు తనే అటెండయ్యాడు. దేనికయినా పెట్టిపుట్టాలి."

సీతాపతి పైకి గర్వంగా చిరునవ్వు నవ్వాడు. లోపల మనస్సు చివుక్కుమన్నది. తన ఖర్మకాలి పి. ఎ. గారింట్లో బంట్రోతులాగా చాకిరీచేస్తే యీ లాభం తనకు...

రాత్రి సీతాపతి భోజనంచేసి పేపరు తిరగేస్తున్నాడు. రాములొచ్చి "బాబూ అయ్యగారు పిలుస్తున్నారు" అని చెప్పాడు.

"యిప్పుడు పిలవటం ఏమిటోయ్ ఎందుకుట?" అని అడిగాడు సీతాపతి.

"నాకు తెలీదు బాబూ పిలుచుకు రమ్మన్నారు."

కమల వంటిల్లు సర్దుతోంది. "యిప్పుడే వస్తాను" అని ఆమెకు చెప్పి విసుక్కుంటూ బయలుదేరాడు. వరండాలో పి. ఎ. గారు వాలుకుర్చీలో కూర్చుని చుట్టకాల్చుకొంటున్నారు. ఒకమూల శంకరం కుర్చీలోకూర్చుని టేబుల్ మీదికి వంగి ఏదో చదువుకొంటున్నాడు. లోపల గదిలో వాళ్ళమ్మాయి కొంటెంగట్టిగానే చదువుకుంటోంది. వరండాలోనే ఒకమూల మంచంమీద ఆయన జ్యేష్ఠపుత్రుడు నిద్రపోతున్నాడు. గురక కూడ విన్పిస్తోంది. ఆయన జ్యేష్ఠపుత్రుడికి కీళ్ళవాతమో, మరేరోగమో వుంది. సరిగా నడవలేడు. నించోలేడు. తన పనులయినా తాను స్వయంగా చేసుకోలేడు. యింకా పెళ్ళయినా కాలేదు. పన్నంగా తలంతా సగం పండిపోయి ముసలివాడిలాగా వుంటాడు. పి. ఎ. గారు అతని ఆరోగ్యం బాగుపడటం కోసరం ఎన్నో మందులు వాడారు. ఎంతమందో డాక్టర్లకు ఎంత డబ్బో ఖర్చయింది కాని లాభం సున్న.

సీతాపతిని చూడగానే పి. ఎ. గారు "ఏం చేస్తున్నావోయ్" అని అడిగారు.

"పేపరు చదువుతున్నానండీ."

"యిది యింకో నెగవ అలవాటు. ఆ పేపరులో ఏముంటుందోయ్, అంత టైము వేస్టు చేసుకుని చదవటానికి?..."

"ఏవో వార్తలు అవీ..."

"ఆ సంగతి నాకు తెలీదని అనుకొన్నావా? ఆ వార్తలు అవీ చదివి నువ్వు ఏం చేర్చుకోవాలి. అసలు అవన్నీ నీకెందుకు? అవి తెలుసుకొంటే నీ కొచ్చేలాభం ఏమిటి? ఏదయినా బి. ఎ. పూర్తిచేసుకొంటే ఎప్పటికయినా లాభం. అదీ గాకపోతే ఏ ఎకౌంట్సు టెస్టుకో కట్టి ప్యాసయితే డిపార్టుమెంటులో పైకొస్తావు అంతేకాని యీ వార్తలు, యీ పత్రికలు ఎందుకోయ్ నీకు? చెప్ప

టానికి మీ నాన్నగాని, యింకెవరయినా పెద్దవాళ్లుగాని దగ్గర లేరు. నేనయినా చెప్ప లేదని అన్నంటారు. వెళ్లి ఆ బి. ఎ. పుస్తకాలు తెచ్చుకొని మా శంకరంతోపాటు చదువు. నాలుగురోజులు చదివితే ఆతరువాత అదే అలవాటవుతుంది."

సీతాపతి సగం బిక్కచచ్చిపోయి "అట్లాగేనండి" అని వెళ్ళబోతుంటే ఆయన పిలిచి పోనీలే యివ్వాళ్టికి, ఆ ఎఫ్. ఆర్. కొత్త పుస్తకం వచ్చింది. కూర్చుని గట్టిగా చదువు. వింటాను. నీకు తెలుస్తుంది. కొత్త రూల్సు నాకూ ఒక్కసారి తెలుస్తుంది. అర్థంకాకపోతే అడుగు చెబుతాను" అని "అమ్మాయి కొత్తదెండు పుస్తకం యిలా పట్టుకురా" అని కేకేశాడు.

తన దురదృష్టాన్ని నిందించుకొంటూ, లోలోపలే ఏడుస్తూ వాళ్ళమ్మాయి తెచ్చి యిచ్చిన పుస్తకాన్ని అందుకొన్నాడు సీతాపతి.

* * *

యిప్పుడు సీతాపతి 'దేవుడా' అంటూ అయిదున్నరకే లేస్తున్నాడు. లేవకపోతే పి. ఎ. గారు ఖచ్చితంగా లేపుతాడు. ఆతరువాత నిద్రమత్తు వదలేందుకని చన్నీళ్ళతో మొహంకడుక్కొని పుస్తకం పట్టుకొని శంకరంతోపాటు ఏడింటిదాకా చదువుకోవాలి. అసలు యింటిదగ్గరే చదువుకొనే రోజుల్లో ఎప్పుడూ ఏడింటికి ముందు నిద్ర లేచినపాపాన పోలేదు సీతాపతి. యిప్పుడు తప్పనిసరి అయింది. యిదివరకు యింట్లో ఎప్పుడయినా తండ్రి ఏడింటికిముందు-అసలు సీతాపతి నిద్రపోతున్నప్పుడు-లేపితే ఆయన మీద విసుక్కునేవాడు. యిప్పటి పరిస్థితి వేరు. యిప్పుడు పి.ఎ. గారు అయిదున్నరకు నిద్రలేవకపోతే వూరుకోకపోవటమేకాదు. ఆతరువాత చదువుతూ నిద్రతో జోగినా "అదేమిటయ్యా. అట్లాచదివితే అయినట్టే. యింకా తెల్లవారుఝామునలేచి చదవటం అలవాటుకాలేదా?" అని అంటున్నా నోరు మూసుకొని చదువుకొంటున్నాడు.

సాయంత్రమూ అంతే! ఆరింటితరువాత ఎప్పుడయినా యింటికొచ్చినప్పుడు పి. ఎ. గారు చూసే "చీకటి పడ్డతరువాత కూడ ఆపీ కొరుకులేవిటోయ్. యివన్నీ నాకు నచ్చవయ్యా. యిక్కడున్నంతకాలం యివన్నీ మానుకోవాలి. సాయంత్రం ఆఫీసునుంచి యింటికిరావటం, స్నానంచేయటం, ఏదో ఒకగంట షికారుకెళ్ళటం, యింటికొచ్చి అన్నంతిని పుస్తకం పట్టుకోవటం, యిట్లా అయితేగాని పైకిరావటం కష్టం తెలిసిందా?" అనేవాడు. సీతాపతి ఏమీ అనలేకపోతున్నాడు. మనస్సులో ఎంతకోపం కట్టలు తెంచుకొని ప్రవహిస్తున్నా 'ఆయన అధికారి, తాను గుమాస్తా' అనే భావం అడ్డువచ్చి అతడిని నిస్సహాయుడిని చేసింది.

# బంగారు పంజరం

భర్త అనుభవిస్తున్న మనోవేదన కమలకు తెలుసు. "ఎందుకండీ యింత చెర అనుభవించటం. ఇంకో నాలుగురూపాయలెక్కువయినా సరే యింకోయిల్లు తీసుకోండి. ప్రతిదాంట్లో ఆయన 'అథార్టీ' ఏమిటి? మనం సరదాగా షికారుకెళ్ళి ఎన్నిరోజులయిందో గుర్తుతెచ్చుకోండి. ఏపనిచేయబోయినా ఆయనేమంటాడో అనే భయమయితే యిక మనం బ్రతకటం ఎందుకండీ" అనేది.

"ఎరక్కపోయి యీ చెరలో యిరుక్కున్నాం. యిప్పుడు వెళ్ళిపొయ్యామనుకో, ఆఫీసులో నాపరిస్థితి ఎంతఅధ్వాన్నంగా తయారవుతుందో తెలుసా? పి. ఎ. గారికి నాకు పోట్లాటవచ్చిందనుకొంటారు అందరూనూ. అదీకాక మనం వెళ్ళిపోతే ఆయనే నామీద మనస్సులో కోపం పెట్టుకుని ఏదయినా చేయగలడు కూడా."

ఆరోజు పి. ఎ. గారు క్యాంపు వెళ్లారు. అందుచేత సీతాపతి ఉదయం అయిదున్నరకు లేవాల్సిన అవసరం లేకపోయింది. అటువంటప్పుడే సీతాపతికి కంటినిండా నిద్ర వుంటుంది. కంటినిండా నిద్రఉంటే అతడు ఆఫీసులో నిద్రపోడు. లేకపోతే అతడు రోజూ మధ్యాహ్నం రెండుగంటలసేపు రికార్డురూములో హాయిగాపడుకోవటం అలవాటుచేసుకొన్నాడు. యీవిషయం అందరికీ తెలుసు. అయినా ఎవరూ ఏమీఅనరు. పి. ఎ. గారి బంధువు!... తెచ్చిపెట్టుకొన్న బద్ధకాన్ని తృప్తిగా అనుభవిస్తూ, ఏడుగంటయినా ఇంకా పక్కమీదినుంచి లేవకుండా కళ్ళు తెరుచుకొనే పడుకొన్నాడు.

పెరట్లో పి. ఎ. గారి సతీమణి మాటలు వినిపిస్తున్నాయ్. "యీ మూడురోజులూ

---

డ్రైవర్‌ను పరీక్షిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ "కారు క్రింద కుక్కపడితే ఏమిచేస్తా"వని ప్రశ్నించాడు.

డ్రైవర్ - తోకపట్టుకొని రోడ్డుప్రక్కకు ఈడ్చేస్తాను.

ఇన్‌స్పెక్టర్ - కోడి పడితేనో?

డ్రైవర్ - అటు ఇటు చూచి బండిలో వేసుకొంటాను.

—టి. జి. మణి (విశాఖపట్టణం)

---

ఏదోరకంగా కొంచెం వండిపెట్టు తల్లీ. మా అమ్మాయి వున్నదంటే దానిచదువే పో దానిదేగాని యితరవ్యాపకాలు లేవు. దానికి కాఫీకాయటంకూడా రాదు..."

"నాకు పెద్దగా వంట చేతగాదండీ. ఏదో మాయిద్దరికీ ఏట్లాగో కష్టపడిచేస్తున్నాను" అంటోంది కమల.

"పరవాలేదులేమ్మా. సుమ్మంఅవతల నేను వుండి అన్నీ చెబుతానుగా. నెమ్మదిగా చెయ్యి. అసలు వంటమనిషిని మాట్లాడుదామనుకొన్నాను. కాని వంటమనిషి చేస్తే యింట్లో ఎవరూ తినరు. ఆయన సరేసరి. వంటమనిషి వండిందంటే అసలు వంటింటివేపే రారు. ఎట్లాగో కొంచెం కష్టపడు తల్లీ."

"అట్లాగేలెండి" అని కమల యింట్లోకొచ్చింది. సీతాపతి మేలుకొనేవుండటం చూసి "మాశారా! యిదీవరస. ఆవిడగారు బయటవుంటే యింటిల్లిపాదికి నేను వండి పెట్టాలట. పైగా పిలిచి చెబుతోంది. నా అంతట నేనే వెళ్ళి 'వండిపెడతాలెండి' అంటే అదివేరు. మనమేదో వాళ్ళ నౌకర్లమయినట్టు చెబుతోంది చూశారా?" అన్నది.

సీతాపతి రెండునిమిషాలు మౌనంగావుండి 'పోనీ నావల్లకాదని చెప్పేసెయ్. ఏమయితే అదే అవుతుంది' అన్నాడు.

"అట్లా ఎందుకులెండి? ఆయన మిమ్మల్ని ఏమయినా చేస్తాడేమో! మూడురోజులేగా ఎట్లాగో అవస్థపడతాలెండి."

ఆరాత్రి కమల సీతాపతి వళ్లో తలదూర్చి బావురుమని ఏడ్చింది. "పోనీకదా అని వండిపెడితే, ఎంత అధారీ చేశారనుకొన్నారు. అతడికి తొమ్మిదిన్నరకల్లా వంటకాకపోతే కోపం వస్తుందిట. పదినిమిషాలు ఆలస్యం అయిందని ఆతల్లి దగ్గర ఎంత ప్రతిమాలించుకొన్నాడు. ఆవిడేమో మెత్తమెత్తగానే నన్ను నాలుగూ అన్నది. జీతంయిస్తున్న పనిమనిషినయినా అంటే వూరుకోదు. నేనూరుకోవాల్సివచ్చింది. యిక ఆఅమ్మాయి సంగతి సరేసరి. మధ్యాహ్నం వంటిగంటకు భోజనానికొచ్చింది. తిన్నకంచంకూడ కడుక్కోలేదుట. నాముందే అది బాగులేదని, యిది బాగులేదని వంకలు. కొంచెం బుద్ధిజ్ఞానముయినా లేదు. పైగా ఆవిడమాటలు చూడండి! 'అది దేంట్లో కొంచెం ఉప్పుకారం అటూ యిటయినా ముద్దనోట్లో పెట్టదమ్మా' అని సమర్థిస్తుంది. పైగా అదితిన్న కంచం నేనెత్తాలిట. నేనెత్తను, సాయంత్రం పనిమనిషి చేత ఎత్తించవచ్చులెండని ఖచ్చితంగా చెప్పాను.....అది కాదండీ. మనకీ చెరలో వుండాల్సిన ఖర్మ ఏమిటండీ. పోనీ యింకో వూరు బదిలీ చేయించుకోరాదూ?"

"నేనూ అదే సీరియస్‌గా ఆలోచిస్తున్నానే. యిటువంటి పోస్టాయనకొంటే అసలు ముందు యీ యింట్లో దిగేవాడినే కాదు. మా ఫ్రెండు ముందే అన్నాడు.

తెలుసుకోలేకపోయాను. యిప్పుడు మనం ఏ కారణం లేకుండా వెళ్ళిపోతే బాగుండదు. పోట్లాడి పోయినా మనకే దెబ్బ. ఏదో పరిస్థితులు తోసుకురావాలి. ఏదిఏమైనా పెద్ద వుపాయం ఆలోచించాలి."

సీతాపతి కోరుకొన్నట్టే పరిస్థితులు తోసుకొచ్చినయ్...

పి. ఎ. గారు పెద్దకొడుక్కి పెళ్ళి తలపెట్టారు. రేపు తనకేదయినా అయితే వాడి నెవరు చూస్తారు. అందుచేత తన స్వార్జితం ఆస్తిలో సగం రాసిస్తాననీ, వాడికి పెళ్ళి చేద్దామనుకొంటున్నానని నలుగురితో అన్నాడు. ఎదిగిన ఆడపిల్లల బరువుతో ఆలోచనా శక్తి హరించుకుపోయిన ఓ ఆడపిల్లల తండ్రి తన కూతురిని పి. ఎ. గారి జేష్ట పుత్రుడికి యివ్వటానికి సిద్ధపడ్డాడు. యింకేముంది? ముహూర్తం నిశ్చయించారు. పెళ్ళి ఏర్పాట్లు జోరున సాగుతున్నాయ్.

సీతాపతికి యీ సంగతి తెలిసింది. వళ్ళు మండింది. ఆఫీసులో నలుగురిముందే "ఆ ఆడపిల్ల నిచ్చే తండ్రికయినా కొంచెం బుద్ధి జ్ఞానం వుండనక్కరలేదూ? చూసు చూసి తన కూతురుగొంతు కోయటానికి సిద్ధపడుతాడా? బ్రూట్! పి. ఎ. గారికయినా యింకో ఆడపిల్ల జీవితం నాశనం చేస్తున్నాననే ఆలోచన రానక్కరలేదూ? ఆ అమ్మాయి మటుకు తన కూతురులాంటిది కాదా? రేపు తనకూతురిని యిటువంటి రోగిష్టివాడికిచ్చి చేస్తాడా?..." అనేశాడు ఆవేశంలో.

ఆ మాటలు పి. ఎ. గారి దాకా వెళ్ళినయ్. ఆ సాయంత్రమే ఆయన సీతాపతిని పిల్చి "ఏమిటోయ్ నీ వ్యవహారం చాలా దాకా పోతోంది" అన్నారు.

"ఏమిటండీ?"

"ఏమిటండీ ఏమిటి? నేను చేసే పనులను కూడా నలుగురుముందు విమర్శించటందాకా వచ్చిందే వ్యవహారం? ఏదో చుట్టానివని దగ్గరకు చేరనిస్తే యిదే నువు చేసే ఘనకార్యం. అసలు నా కొడుకు పెళ్ళిసంగతి నీకెందుకు? నా కొడుకు ... తెంచి యింట్లో చేరనిచ్చినందుకు ... ఫలితం! చాలా బాగుందోయ్. నిన్నని ఏం లాభంలే. నెత్తికెక్కించుకోవటం నాది తప్పు. ఎక్కడ వుంచాల్సిన వాళ్ళను అక్కడే వుంచాలి."

తలొంచుకొని వచ్చేశాడు సీతాపతి. యిన్నిమాటలు పడ్డ తరువాతయినా ఒక్క ముక్కయినా అతడి నోటివెంట రాలేదు. ఎప్పుడయినా తండ్రి 'రాత్రి పదకొండింటి దాకా ఆ తిరుగుళ్ళెందుకురా? కాస్త పెందలాడే యింటికి చేరుకోరాదూ' అని అంటే తండ్రి మీద ఎదురుతిరిగేవాడు. యిప్పుడిన్ని మాటలు పడీకూడ నోటిల్లోంచి మాటలు పెగలక తిరిగొచ్చేశాడు. వుద్యోగ మహిమ! ఏమంటే తన వుద్యోగానికి ఏం తంటా తెచ్చి పెడతాడో? ఆఫీసరుతో జాగ్రత్తగా వుండడం మంచిది... కాని యీ



దీపాలంకరణ

చిత్రకారుడు—అంకోలు శేషగిరిరావు (నూజవీడు)

నరకంలోంచి ఎలాగయినా తప్పుకోవాలి. ఎలా? ఏమీ మార్గం ఎంత ఆలోచించినా తోచలేదు. పాము చావరాదు. కర్ర విరగరాదు. ఏం చేస్తే వీలవుతుంది. ఆయనతో పోట్లాడినట్లు ఆయన అనుకోరాదు. తనకీ నరకంలోంచి విముక్తి కావాలి...

ఆలోచించి విసుగెత్తి ఆఖరికి సలహా కోసం తనకు మొదట ఆశ్రయం యిచ్చిన స్నేహితుడిదగ్గరి కెళ్ళాడు. అతడికి మటుకు యిటువంటి వ్యవహారాలేం తెలుస్తయ్. అతడు సీతాపతిని పదిహేనేళ్ళు సర్వీసున్న ఓ సీనియర్ గుమస్తా దగ్గరికి తీసికెళ్ళి అన్ని వివరంగా చెప్పి సలహా అడిగాడు.

ఆయన "ఓస్ యింతేనా?" అని నవ్వి "ఏముందండీ? మొదట పుట్టింటినుంచి వుత్తరం వచ్చిందని మీ శ్రీమతిని పంపించెయ్యండి. ఆ తరువాత ఒక్కడికీ యింత యిల్లెందుకని మీ ఫ్రెండ్ రూము కెళ్తానని సామానులతో వచ్చెయ్యండి. ఆయన మీ మీద కోపంతో ఆఫీసులో ఏడిపిస్తే ఏ డాక్టరు దగ్గరయినా సర్టిఫికెట్టు పుట్టించి ఓ రెండు నెలలు సెలవు పెట్టండి. ఆటోమాటిక్‌గా మిమ్మల్ని యింకోవూరు ట్రాన్స్‌ఫర్ చేసేస్తారు. అంతే" అన్నాడు.

సీతాపతికి ఏనుగెక్కినంత సంతోషం కలిగింది. హుషారుగా యీల వేసుకుంటూ యింటికి బయలుదేరాడు. ★